# మంచుమంట

"వెళ్ళకు" అంటూ నూతిలో గొంతుకలా తల్లి మాట వెనకనుంచి వినిపిస్తున్నా, తనను కాదన్నట్లుగా గడప దాటింది సువర్ణ. వీధిలో ఎండా వానా దాగుడుమూత లాడుకుంటున్నాయి. నేలంతా చిత్తడిగా హృదయంలోని ఆరాటంలా చిరాకు కలిగిస్తోంది.

మొహంమీదకు పడుతున్న ముంగురులను ప్రక్కకు సర్దుకుని, బుజం నిండుగా పమిటచెంగు కప్పుకుని, ఎండిపోతున్న పెదిమలను నాలుకతో తడుపుకుని, కళ్ళనిండా ఆశలతో మనస్సంతా బెదురుతో ప్రక్కనేవున్న ఇంట్లోకి ప్రవేశించింది సువర్ణ.

ప్రవేశించే లోపునే గడప ఇవతల గుట్టుగా పెరిగిన నందివర్ధనం కొమ్మ కదిలి, అప్పుడే లోపలకు ప్రవేశిస్తున్న సువర్ణ మొహంమీద ఒకానొక నీటిబొట్టును చిల్కరించింది. మంచులా వున్నది నీటిబొట్టు! ఒళ్ళు ఝల్లుమనగా, ఎడమచేతి కొన వ్రేలితో నుదురు తుడుచుకొంది. నుదుటిమీది నీటిబొట్టు ప్రక్కకు కదిలి, అటుపై క్రిందకు జారి, పెట్టు కున్న కళ్యాణ తిలకాన్ని చెరిపింది. చెరిగిన కుంకుమబొట్టు నుదు టిపై మంటలా జ్వలిస్తోంది. గడపమీద కాలువేసిన సువర్ణ ఒక్క క్షణం ఆగి, వాతావరణాన్ని పరిశీలించింది. ఆకాశవాణి సంగీతం విన్పించడం లేదు. పసిది, కాన్వెంటు పాఠాలతో ఇల్లుపీకి పందిరి వేయడం లేదు. వంటింటి లోపలనుంచి సాతాళింపు వాసనలు గాలిలో సుళ్ళు తిరగడం లేదు. ముసలాయన గీతాపారాయణం వచ్చేవారికి స్వాగతం పల్కడం లేదు. ఇల్లంతా నిశ్శబ్ద నిశీధిలా, జాలిగొల్పు తోంది.

సువర్ణ తనకు తనే ధైర్యం చెప్పుకుంది. తనకు ఎంతగానో పరిచయమైన ఆ ఇంటిని చూచి తాను ఇంతగా భయపడడమేమిటి? తన ఆశలు మాలగా గ్రుచ్చి ఆ ఇంటికి తోరణం కట్టింది. తన స్త్రీత్వం పండించేపంట ఆ ఇంట సార్థకత చెందాలి.

అయినా ఆ యిల్లు భయం కల్గిస్తోంది. తన హృదయం వెన కడుగు వేస్తోంది.

సువర్ణ అడుగులో అడుగుగా, పమిటచెంగే జయపతాకగా, మెల్లగా హాల్లోకి ప్రవేశించి, ముందుకు అడుగురాక, నోటమాట పల కక, విధిగీసిన చిత్తరువులా మధ్యగా నిల్చుండి పోయింది.

గడపమీద తల పెట్టుకుని, కొంగు పర్చుకుని పడుకున్న ఆ ఇంటి నడివయస్సు ఇల్లాలు, అడుగుల చప్పుడువిని, తల ఎత్తిచూచి, ఆశ నిరాశగా మారగా "నువ్వా!" అన్నది నమ్మలేనట్లుగా. కుర్చీలోపడుకున్న బట్టతల ముసలాయన కళ్లుతెరచి, సువర్ణను చూచి ఆ వ్యక్తి రాక, అనంగీకారమన్నట్లు మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

గోడకు బల్లిలా అంటుకొని, గంటసేపటినుంచి స్తబ్దుగా నిలబడ్డ పసిపిల్ల బావురుమంటూ ముందుకు పరుగెట్టింది. సువర్ణ చేతులు చాపి ఆ పిల్లను కౌగిటికి తీసుకుంది. గువ్వపిట్టలా తన అక్కునచేరిన ఆ పసి దానితల నిమురుతూ, తన ఎదుట కన్పిస్తున్న ఆ ఇద్దరు వ్యక్తులనూ పలకరించే తీరు తెలియక, అతనినిగూర్చి ప్రశ్నించడానికి నోరురాక అక్కడే నిల్చుండి పోయింది. కాళ్ళు నొప్పి పెడుతున్నాయి. పలక రించనివారు తనకది చెప్పకుండా విధించిన శిక్ష అనిపిస్తున్నది.

చూసిచూసి, తనే సాహసించి అడగబోయింది. పెదిమలు వణికాయి.

గడప నానుకుని, గోడవారగా కూచున్న ఆ నడివయస్సు ఇల్లాలే ఆ నిశ్శబ్దాన్ని భంగం చేసింది.

"నిన్ను నా కూతురుకన్న ఎక్కువ గారంగా పెంచాను. ఇదా తల్లీ-చివరకు నువ్వు నాకిచ్చిన ప్రతిఫలం?" ఆమె కళ్ళల్లో నీళ్ళు, ఆమె గొంతులో గీర. సువర్ణ బాధగా కదిలింది. ఏదో చెప్పబోయింది.

"నువ్వేం చెప్పకు. అంతా తెలిసిపోయింది మాకు. అబ్బాయ్ చెప్పాడు."

"వారే చెప్పారా?" 'అన్నమాట తప్పకుండా, ఆయన నిన్న రాత్రి ఇంట్లో ఆ విషయం ప్రస్తావించాడన్నమాట. ఎంత మంచివాడు!'

"ఆ! చెప్పాడు. అంతస్థుల భేదం మనకు వద్దు. ఆశలూ, ఆశయాలూ అని మాట్లాడకు. మేం సువర్ణను కోడలిగా భావించడం లేదు. కన్నకూతురే అనుకొంటున్నాం. శాఖలు వేరైతే ఏం? ఈ ఇంట్లో ఇంతప్పటినుంచి పెరిగింది. ఈ నాటికి ఆపిల్లే కోడలుకావటం నా మటుకు నాకు మనస్సంగీకరించడం లేదు అంటూ నేనే చెప్పాను."

"అత్తయ్యగారూ!" తన మనసులోని మాటను చెప్పాలను కొంది సువర్ణ. "ఏ అడ్డంకీ రాదని, అందరూ తమను ఆనందంగా ఆశీర్వదిస్తారని, తామిద్దరూ ఒకటయ్యారని ఎలా ఆమెకు చెప్పడం? ఆడ దాని హృదయాన్ని ఆడదే అర్థం చేసుకోకపోతే ఎల్లాగు?"

బట్టతల ముసలాయన, ఆవిడ చెప్పిన మాటలువిని, కళ్ళు తెరిచాడు. సువర్ణ భయంతో పాలిపోయి కన్పిస్తోంది. ఎందుకో ఆయనకు తెలీలేదు. "ప్రేమ మూలాన" అనుకున్నాడు. "తనకు ప్రేమలూ, ఆధునిక భావాలూ నచ్చవని సువర్ణకు మాత్రం తెలీదా?" అనుకున్నాడు.

"చూడమ్మా! వయసులో మనసు కోతిలా గంతులేస్తుంది. దానికి ప్రేమ అనే కల్లు తాగించారు. ఇహ చెప్పనక్కరలేదు దాని విషయం. అబ్బాయితో రాత్రి మాట్లాడాను. పిచ్చివాడు! అలిగి వెళ్ళిపోయాడు"

"వెళ్ళిపోయారా?- ఎక్కడికి ?" నెత్తినపడ్డ పిడుగునెలా నంబాళించుకోవడమో తెలీక కుప్పకూలిపోయింది సువర్ణ. ఆమె కళ్ళముందు తాను కట్టుకున్న భవనం, పునాదితోసహా కూలిపోతున్నది.

మళ్ళీ ఆయన మాట్లాడాడు. "పొరపాటు, అలిగి వెళ్ళిపోలేదు. నే చెప్పింది అర్థమై తన చిన్నతనం తెలిసి మొహం చూపించలేక ఎక్కడికో వెళ్ళిపోయాడు."

ఆవిడ అందుకుంది. "అన్నం అన్నా తినలేదు. తింటూండగా వచ్చింది సంభాషణ. చెయ్యన్నా కడుక్కోకుండా వెళ్ళిపోయాడు. కన తల్లి మీదకన్నా, కన్నుపడ్డ నువ్వెక్కువైనావు వాడికి."

ఆవిడ మాటలు పూర్తికాకుండానే మళ్ళీ ఆయన మాట్లాడాడు. "అమ్మాయ్! ఒక్క సంగతి చెబుతున్నాను విను. ఈదేశంలో కన్న కొడుకుల కూతుళ్ళ పెళ్ళిళ్ళు తల్లిదండ్రుల చేతులమీదుగా జరగాల్సిందే తప్ప, లేచిపోవడాలూ రభస జరగడాలూ జరగవు. ఆ రోజురాదు. అందుచేత, నేనూ, మీ అమ్మా నాన్నతో చెప్తాను మంచి సంబంధం తెచ్చే భారంనాది. నువ్వన్యాయం అవుతుంటే మేం వూరుకుంటామా" రెండుపైపుల నుంచీ వర్షపు జల్లులా పడుతున్నాయి వాడిబాణాలు. సారధి లేక అస్త్రవిహీనయై. సంగరమధ్యంలో నిలబడి నట్లయింది సువర్ణకు. తను ఎవరితో ఏం మాట్లాడాలి, ఏమని ఎవరిని ఒప్పించగలదు—అయిన వాడే పిరికిగా పారిపోయింతర్వాత ?

పసిదాని చేతులను తప్పించుకుని, లేచి నిలబడి వెనకకు అడుగు వేసింది. వాళ్ళ మాటలు వినబడుతూనే వున్నాయి.

"కట్నం తక్కువైతే సర్దుబాటుచేసే పూచీ నాది. గాబరా పడకు."

వరండాలో స్థంభాలకు చుట్టుకున్న మాలతీ లత పుష్పాలు వర్ణ విహీనమై కన్పిస్తున్నాయి. మబ్బుతెర మీదపడి, వాటి వాసన వెగటు కలిగిస్తోంది.

"అమ్మ నడిగానని చెప్పమ్మా ? ఆ గుండెదడ తగ్గిందా?" మాటలు మంచులా గుండెకు తగలుతున్నా, ఆశలు, అర్థాల మంటల వెనక తగలబడి పోతున్నాయ్!

సువర్ణ బరువుగా తలవూపి బయటకు వచ్చేసింది. తనూ, ఆయనా ఒకటయ్యారు. తన నుంచి విడివడి ఆయన పారిపొయ్యారు. ఎట్లా తను బ్రతకడం ?

నిన్నరాత్రే, ఏటిగట్టు అవతల, మామిడిపుంత దగ్గర తను, వెన్నెల చల్లదనం మధ్య ఆయనను కలుసుకుంది. ఇద్దరూ త్వరలోనే ముగ్గురు కావచ్చునని సూచించింది. తన బ్రతుకేమిటని ప్రశ్నించింది. ఆయన నవ్వారు. భయం భయంగా, మంచుకన్న చల్లగా. "ఎట్లా ఇప్పుడు ?" అన్నారు. తనకు కోపం వచ్చింది. కసిగా అన్నది. "ఇట్లా జరుగుతుందని ఆనాడు ఆలోచించుకో లేదా?"

ఆయన మౌనంగా వూరుకున్నాడు. ఆయనకన్నా మాట్లాడని చెట్టు నయం.

"ఇంట్లో చెప్పండి నేను మీవాళ్ళకు కొత్తదాన్ని కాదు. వాకన్నా అందమైనదాన్ని, చదువుకున్నదాన్ని కోడలుగా తెచ్చుకోలేరు లెండి మీ అమ్మగారు."

"అవునవును" అంటూ అయన తలవూపి లేచి నిలబడి, "మంచు పడుతోంది. నీ వొంటికి మంచిది కాదు పద పోదాం" అన్నాడు తనను దగ్గరకు తీసుకోవడానికి ప్రయత్నిస్తూ.

"రేపు ప్రొద్దున్న నేనే మీ ఇంటికి వస్తాను. నవ్వుతూ నాకు మీరు స్వాగతం చెప్పాలి" అన్నది తను దూరంగా జరుగుతూ.

ఇట్లా జరుగుతుందని తనుఅనుకోలేదు. పారిపోయాడు - ఆయన!! తన రాగం అపాత్రదానమైంది. ఎలా తన స్త్రీత్వాన్ని కాపాడుకోవడం- నరుల నోళ్ళనుండి, నాగరికుల చూపులనుంచి.

సువర్ణ గడప దాటడం చూచి, "హుః కట్నం లేకుండా బంగార మంటి పిల్లవాణ్ని కొంగున కట్టుకుందామనుకొంది" అన్నది ఆ ఇల్లాలు.

"ఊదులేవే! పాపం, ప్రేమించిందేమోలే నిజంగానే" అన్నడా ముసలాయన.

"ప్రేమా చట్టుబండలూ? పెళ్ళి చేసుకోడానికి ప్రేమెందుకండీ? నేనేం చూసి చేసికున్నానుట, మిమ్మల్ని?"

సువర్ణ వెళ్ళినవైపే చూసిచూసి, ఆ పసిపిల్ల మెల్లగా తల్లిదగ్గరకు చేరి అడిగింది. "ఇంకెప్పుడూ వదిన మన ఇంటికి రాదా అమ్మా?"

అట్లా అన్న తనవైపు తల్లి కోపంగా చూడడంతో, మళ్ళీ ఆపిల్ల మాట్లాడలేదు.

పతితురాలి కన్నీటిలాంటివాన బయట. సువర్ణ అతి భారంగా అడుగులు వేస్తూ, మెల్లగా తనఇంటి వరండాలోకి వచ్చింది. ఆమె తల మీదనుండి నీళ్ళు కంటిరెప్పల మీదపడి, కారే కన్నీటితో కలిసి వక్షస్సు మీదకు జారిపోతున్నాయ్. మొగానవున్న బొట్టు చెరిగి, కరిగిన కాటుకతో కలియడానికి యత్నిస్తున్నది. ఆమె రూపు దాల్చిన శోకంలా వీధిలో నుండి వరండాలోకి వచ్చి, అక్కడ నిలబడిపోయింది. తనతల్లి కొయ్య పడకకుర్చీలో దుప్పటి కాళ్ళమీదుగా కప్పుకొని కూచుని మాట్లాడు తున్నది. నాన్నగారు క్రింద చాపమీద కూచుని, పద్దులు లెక్క చూచు కుంటున్నారు.

ఆయన మెల్లగా తలఎత్తి, ఇబ్బందిగా మొహంపెట్టి అన్నాడు. "అదికాదే:- నువ్వు చెబుతూనే వున్నావు. నేను కాదనడం లేదు."

"చూడండి. మీరు ఏది కాదన్నారు కనుక, ఇది కాదంటారు? ఇటువంటి విషయాల్లో జాప్యం పనికిరాదు. ఎదిగిన ఆడపిల్ల ఇంట్లో వుంటే, గుండెలమీద కుంపటిని పెట్టుకున్నట్లు. వెళ్ళండి, వెళ్ళండి.

ఈ ఇల్లు కాస్తా ఏ అయ్యకో తాకట్టుపెట్టి ఏ అయిదు వేలో, అరువేలో పట్టుకురండి, ఆ పెళ్ళి కాస్తా జరిపించేస్తే నేనేమై పోయినా, నాకేం పర్వాలేదు."

"మరి నా సంగతి ఏం ఆలోచించావేం ?" నాన్నగారు భయం భయంగా అడిగాడు. అమ్మ ; 'ఈమాత్రం తెలీదేం మీకు ?" అన్నట్లు ఈసడింపుగా ఆయనవేపు చూసింది.

"మీకేం ?- ఈ ఇల్లే వుండి మీకు తిండి పెట్టాలని లేదుగా ?- రెక్కాడితే మీకు డొక్కాడక పోదు" ఆయన కళ్ళమీదనున్న పాత కళ్ళజోడు ముక్కుమీదకు జారిపోతున్నది. మాసికలు పడ్డ లాల్చీని కండువా దాచలేకపోతున్నది. కండ్ల క్రింద ఏర్పడ్డ నల్లని చారికలు పారిపోతున్న వయస్సుకు సాక్షుల్లా వున్నవి. ఆయన అన్నారు ఆలోచించుకుంటూనే, "అంత తొందరేమొచ్చింది ఇప్పుడు!"

అమ్మ మొహంలో విసుగుదల స్పష్టంగ కన్పించింది. చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభం ఏమిటే ?"

"ఇప్పటికే పిల్లకు కట్టుతప్పే వయసొచ్చింది.''

ఆయన తలదించుకు కూచున్నవాడల్లా ఉలిక్కిపడి తలెత్తిపైకి చూశాడు. ఎదురుగా సువర్ణ కనిపించింది, దిగులుగా, నీళ్ళ ముద్దలా వణుకుతూ.

సువర్ణ తల్లిదండ్రుల మొహాలవంక చూడలేక, తల వంచుకుని సరాసరి వంటఇంటిలోకి వెళ్ళబోయింది. సువర్ణనుచూసి, అమ్మ అన్నది కోపాన్ని ప్రేమగా మార్చుకుంటూ. 'ప్రొద్దున్నే షికార్లేమిటి ? - లేవలేని దాన్నొకత్తెను ఇట్లా కుర్చీలో పడున్నాననైనా చూడకుండాను?-

సువర్ణ ఆగింది. గుమ్మం పట్టుకు నిలబడింది. జవాబు చెప్ప లేదు. వంటింట్లోనుంచి పాలుకాగి పొయ్యిలోపడ్డ వాసన వేస్తున్నది.

'వెళ్ళ వెళ్ళ, కాగినపాలమీద నీళ్ళు చిలకరించు. కొత్త ముందూ వెనక చూసి, అడుగు వేస్తుండాలి. సువర్ణ వంటఇంటిలోకి వెళ్ళి పోయింది. నాన్న కండువా సరిచేసుకుని, పద్దు పుస్తకాలు చంకన పెట్టుకుని, అమ్మతో ఏమిటో చెప్పి, టైరు చెప్పులు తొడుక్కొని వీధి లోకి వెళ్ళడం కన్పిస్తోంది. ఆయనను చూసి సువర్ణకు జాలివేసింది. యంత్రంలా శ్రమిస్తున్నాడు. కోర్టు వరండాలో కూచుని కాగితాలు రాసి, రిజిష్ట్రారు ఆఫీసులో సాక్షి సంతకాలు పెట్టి మధ్యమధ్యలో కావల సినవాళ్ళకి టైపుచేస్తూ, సాయంకాలం ఇంటికి వచ్చేసరికి ఏ అయిదో పదో తీసుకువచ్చి, అమ్మచేతి కిస్తారాయన. ఏరోజు అట్లా తీసుకు రాకపోయినా ఇంట్లో నరకమే. అట్లా తీసుకువచ్చినప్పటికీ 'ఇంతేనా?' అంటుంది అమ్మ. మళ్ళీ ఆయన పొగాకు కొట్లల్లో పద్దులురాసి, లెక్క రాసిపెట్టడానికి బయలు దేరుతాడు. పాపం! అమ్మమాత్రం ఏం చేస్తుంది? ఆమెకు ఎవరున్నారు తను తప్ప? తననో అయ్యచేతిలో పెట్టి కన్నఋణం నుంచి విముక్తి కావాలని ఆమె ఆశ. ఆ ఆశ ఇంతలో నెర వేరేమార్గం కనిపించడంలేదు. నాన్న కష్టపడుతున్నారు. అమ్మ డబ్బు కూడపెడుతున్నది. తనకుపెళ్లి కావాలి, పెళ్ళి!!

సువర్ణ నవ్వుకుంది ఏడ్వలేక. తన జీవితాన్ని తను నాశనం చేసు కొంది. పువ్వులతోట అనుకుని అగ్నికీలల మధ్యకు ప్రవేశించింది. చిన్నప్పటినుంచీ ప్రక్కయింటివారి ఆదరణలో తను పెరిగింది. ఆయన మున్సబుగిరీ చేసి రిటైరయ్యారు. ఏ అవసరం వచ్చినా అమ్మ వెళ్లి వాళ్ళకు సాయం చేసేది. నాన్న సరేసరి. ఆ ఇంట్లో పనివాడు ఆయనకన్నా నయం. ఆ అనుబంధం అనురాగంతో అనుకున్నది. ఆ ఇంట్లో పెరిగిన కుర్రవాడికి ఆ నటనలుతప్ప మరేమి రాగలవు? నటన అంతా నటన అయిపోయింది. అతని ప్రేమనటన. ఆ వాక్కులోని తీయదనమొక నటన. తన శీల సంపద ఒక నటన. ఇహ తనబ్రతుకే ఒక నటన.

ఆలోచించుకొంటున్న సువర్ణ తల్లి పిలుపు విన్పించి హాల్లోకి వచ్చింది. ఆమె తనవేపు అంత నిశితంగా పరిశీలించి చూస్తున్న దెందుకు ?—తన కడుపున దాగినజీవి కదలికలను గమనించడం లేదు కదా ?

"ఇట్లా !- ఇంకా దగ్గరకు" సువర్ణను తీసుకుని గుండెలకు హత్తుకుంది అమ్మ.

"తల్లీ ! ఈ గుండెజబ్బు నన్ను తినేస్తున్నది. నాకు తెలుసు ఇహ నే నెక్కువకాలం బ్రతకను ? ఈ లోపలే నీకు ఆ మూడుముళ్ళూ వేయాలి. నేను కన్నవాళ్ళు నాలాగా బ్రతకకూడదు. ఈ దరిద్రంలో ఈవిధమైన తక్కువ ఆలోచనలతో, క్షణక్షణం పోరాటం సాగిస్తూ."

ఇదేమిటి అమ్మ ఈరోజు వింతగా మాట్లాడ్తున్నది ? సువర్ణ ఆశ్చర్యపడి కనురెప్పలెత్తి అమ్మవైపే చూసింది. అమ్మ కళ్ల మూసు కుని పడుకుని వున్నది. ఆమె కన్నులనుండి కన్నీరు కారిపోతున్నది. అమ్మ ఎంత మంచిది ?.... ఆ తల్లికి తగిన కూతురేనా తాను ?

తల్లి చేతులు తప్పించి, లేవబోయింది. అమ్మ తనను గట్టిగా పట్టుకుంటున్నది లేవనీకుండా. "ఈ నీడా లేకపోతే మీనాన్న గూడు లేని పక్షిలా, ఈ వృద్ధాప్యంలో బ్రతకవలసి వస్తుందని నాకు తెలుసు. అయినా తప్పదు. నీ సుఖంకోసం, కన్నవాళ్ళం ఈ మాత్రం త్యాగం చేయకపోతే ఎల్లా !"

త్యాగం ?-తనకోసం ! ఒకరి త్యాగానికి తను అర్హమైనదేనా ? అయ్యో ! తను భ్రష్టురాలనని, తను ఒకరి త్యాగానికి తగినదానను కాదని, ఎల్లా అమ్మకు తెలియజెప్పడం ?

"అమ్మా ! నాకు పెళ్ళివద్దు"

ఆ మాటవిని తన మెడచుట్టూ లతల్లా పెనవేసుకున్న అమ్మచేతులు బలహీనంగా కదిలాయి." ఓసి పిచ్చిదానా ! ఎంత అమాయకురాలివే !

ఆడదానికి పెళ్ళి, ప్రేమకోసం కాదే. అండకోసం, బ్రతకడంకోసం. భర్తలేని ఆడది తెగిన మాంసఖండంవంటిది. ఏపక్షులైనా ఆపేక్షిస్తాయి. అందుకు ఆడది భ్రష్టకాకూడదు. తన శీలాన్ని రొష్టుచేసుకోకూడదు. ఆడదాని జీవితం అంతా గుట్టుగానే వుండాలి తల్లీ?" తల్లిమాటలు సువర్ణకు కొరడాలా తగులుతున్నాయి. ఆ అమాయకురాలి గుండెను మండిస్తున్నాయి. ఆ మాటలమధ్య ఆమె జీవితం భగ్గున తగలబడిపో తున్నది. తను భ్రష్టురాలు! శీలవిహీన! పెళ్ళికి తనకు అర్హ తగలదా! లేచి మెల్లగా వంటఇంటి లోపలకు వెళ్ళిపోతున్న కూతురును కంటి కొనలనుంచి చూసి అనుకొన్నది ఆమె. "బంగారుతల్లి! ఎవరికి రాసి పెట్టివుందో!"

బయటినుంచి నంబి ఆచార్లువారు సైకిలుదిగి, మందులసంచీ చేత పుచ్చుకుని లోపలకు రావడం చూసి, ముంగాళ్ళమీద కూచున్నదల్లా, కుర్చీలో సర్దుకు కూచున్నది ఆమె. ఆయన వచ్చి, ఆమె నాడి పరీక్షించి, స్టెతస్కోప్‌తో గుండె కొట్టుకోవడం విని, కనురెప్పలక్రింద దాగిన రక్తాన్ని పరీక్షించి "నీకేం భయంలేదు. బాగా కోలుకున్నారు. గుండెకు కూడా బాగానే బలం వచ్చినట్లుంది" అన్నాడు మందు పొట్లాలుగా కట్టుతూ.

ఆమె పేలవంగా నవ్వింది. "ఎండిపోతున్న చెట్టును నేను. నా గురించి బాధలేదు. అదిగో - అభం శుభం తెలీని అమ్మాయినిగురించి నాకు వున్న చింత. ఈమధ్య ఎందుకో అది చిక్కిపోతోంది. దాన్ని కాస్త పరీక్షించండి బాబూ!"

ఆచార్లువారు మందులు కట్టియిచ్చి, "అట్లాగే తల్లీ!" అంటూ స్వతంత్రంగా లోపలకు వచ్చారు. పొయ్యి దగ్గరగా సువర్ణ స్నానంచేసి అప్పుడే చీర కట్టుతుంది. చీర మడతల్లో దాగలేక అందం బయటకు పారిపోతున్నది.

"ఏమిటమ్మా! - ఏదో అనారోగ్యంగా వుండట నీకు?"

ఉలిక్కిపడి వెనక్కు తిరిగి ఆచార్లుగారిని చూచి పాలిపోయింది సువర్ణ. "తన రహస్యం ఈ చిత్రగుప్తుచి చిఠాలో ఎక్కక తప్పదు గామోసు. భగవంతుడా!" అని నిట్టూర్చింది.

"ఆరోగ్యంగానే వున్నాను" అన్నది బలహీనంగా.

"నిన్ను చూస్తేనే తెలుస్తోంది. ఎందుచేతనో నువ్వు బాధపడుతున్నావని."

ఆచార్లుగారు తండ్రిలాగా అనునయించి, సువర్ణ చేతిని తన చేతిలోకి తీసుకుని నాడి పరీక్షించారు. గుండె శబ్దం విన్నారు. సువర్ణ సిగ్గుతో భయంతో ఏమీ చెప్పలేని స్థితిలో వుండగా, 'అమ్మాయ్!- ఇల్లా అడిగానని ఏమీ అనుకోబోకు. నెలనెలా ...

సువర్ణ మొహం కప్పుకొని, కళ్ళలో నీళ్ళతో అక్కడనుండి అవతల గదిలోకి పారిపోయింది. "అయిపోయింది. తన రహస్యం అందరికీ తెలిసిపోయింది. తననిహ బోనులో నిలబెట్టి, అందరూ ప్రశ్నలు వేస్తారు. తను దోషి. నిర్దోషిత్వాన్ని నిరూపణ చేసుకోలేని అబల."

మందుల సంచీ చేతబుచ్చుకుని, వెళ్ళిపోవడానికి ఉద్యుక్తుడౌతున్న ఆచార్లువార్ని చూచి ఆమె అడుగుతోంది. "అమ్మాయిని పరీక్ష చేశారా?"

ఆచార్లువారు కొంచెంసేపు నిశ్శబ్దం వహించారు. ఆ తర్వాత కొంచెం గంభీరంగా అన్నారు.

"చూడమ్మా! గాయం వున్నచోటనే మరోదెబ్బ తగులుతుంది. కష్టాలున్నచోటే మరో ఇన్ని కష్టాలు నెత్తిన పడతాయి. కాస్త మనం ధైర్యం వహించాలి."

ఆమెకు అర్థం కాలేదు. ఆమె హృదయం ఏదో కీడును శంకి స్తోంది. అయినా తను నిబ్బరంగా నిలబడాలి. "ఏమిటి?" అన్నది ఆయన వైపే నిశితంగా చూస్తూ.

"ఈ రహస్యాన్ని నా గుండెల్లో పెట్టుకుంటాను. అమ్మాయికి మీరు తొందరగా పెళ్ళి జరిపించేయండి."

ఆమె కంగారు పడుతూ అడిగింది. "ఏమిటా రహస్యం?"

"సువర్ణ మామూలు మనిషి కాదమ్మా! చూలాలు"

ఆఁ! నమ్మకం చాలడంలేదు ఆమెకు. అయినా డాక్టరే స్వయంగా చెబుతున్నప్పుడు నమ్మకుండా వుండడమెట్లా? తన సువర్ణ, తమ ఆచా రాలతో, కట్టుబాట్లతో పెంచిన సువర్ణ కాలుజారిందా? – భగవంతుడా!

ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఆమెలో ఆలోచనలు కట్టుతాడు తెంచుకున్నాయి. రక్తం ఉధృతంగా నరనరంలోకి ప్రవహిం చడం మొదలెట్టింది. ఆచార్లుగారు ఆమె వైపుచూస్తూనే వున్నారు. అల్లాగే ఆమె కళ్ళు మూసుకుపోయాయి. నిర్జీవియై ఆమె చేతులను క్రిందికి వాల్చివేసింది. ఆచార్లుగారికి చేతులూ కాళ్ళూ ఆడడంలేదు. తను లోపలికి పరుగెత్తి ఇన్ని నీళ్ళుతీసుకువచ్చి ఆమె కళ్ళమీద, చెంపలమీద, నొసటిమీద చిలకరించారు. ఆమెలో చలనంలేదు. ఏదో అరకుతీసి ఆమె పెదిమలకు అంటించారు. పళ్ళుగిట్టకర్చుకు పోయాయి. భార్య ఆనతిమీద వెళ్ళవలసినచోటుకు వెళ్ళి ఆమెచెప్పినట్లుచేసి, డబ్బు తీసుకుని, ఇంటికి అంచెలమీద తేలిపోతూ వచ్చిన ఆయన ఈదృశ్యం చూసి అట్టే ప్రమాన్పడిపోయారు.

'ఆచార్లుగారూ ఇదేమిటి?– అర్ధాంతరంగా ఈ ఉపద్రవం ఏమిటి?"

ఆచార్లుగారు సమాధానం చెప్పలేదు. కూచోమని ఆయనకు సంజ్ఞచేసి, తను మందు కలపడంలో నిమగ్నమైపోయారు.

ఆయన కూచోలేదు. మెల్లగా భార్యదగ్గరకు నడిచారు. "చూడు, డబ్బుతీసుకు వచ్చాను.–ఇల్లు తాకట్టుపెట్టి. నీకోసమని, నాకు ఇష్టంలేని పనికూడా చేశాను. నన్నన్యాయం చేయకు. ఈ వయసులో వంటరి వాణ్ణి చేయకు. ఉహూ. నాకు బ్రతకడం చేతకాదు. నువ్వు నడిపిస్తేనడిచాను. తినమంటే తిన్నాను. నాజీవితం అది. అట్లాగే వెళ్ళిపోనీ.''

తండ్రి దీనాలాపం విని, గదిలో టేబులుమీద తలపెట్టుకు పడు కున్న సువర్ణ లేవలేకలేచి హాల్లోకి వచ్చింది. ఎదురుగా శోకమూర్తిలా తండ్రి. సువర్ణను చూశాడాయన. మొహాన బొట్టులేదు. కంటికి కాటుక లేదు. పెదిమపై నవ్వులేదు. జీవకళ కన్పించలేదు. ''తల్లి కోసం'' అనుకున్నాడు.

"అమ్మలూ ! అన్యాయం చేసిపోతున్నదమ్మ!'' సువర్ణ మెల్లగా నడిచివెళ్లి తండ్రి దగ్గరగా నిలబడ్డది. ఆయన తన బుజానవున్న కండవాను ఆమె చెతుల్లో పెడుతూ, "ఇదిగో తల్లీ ! మూటకట్టితెచ్చాను డబ్బు, ఇల్లు తాకట్టుపెట్టి. నిన్నొక ఇంటిదాన్ని చేద్దామని, ఇంటిదే వెళ్ళిపోతోంది. రేపు ప్రొద్దున్న నీదారిన నువ్వు వెళ్లిపోతావ్. ఇహ నన్ను చూసేవారెవరు ?—ఓయి భగవంతుడా !'' అన్నాడు.

సువర్ణ మాట్లాడకుండా తండ్రివేపు చూస్తూ నిలబడ్డది. ఆమె గుండెల్లో మంచుమంట. అది దహిస్తోంది. అయినా అణువణువూ ఎంత చల్లగా వుంది !

తండ్రి ఇచ్చిన డబ్బును, తల్లిప్రక్కనపెడుతూ, అమ్మ బ్రతుకు తుంది నాన్నా! భయపడకు'' అన్నది. "బ్రతుకుతుందా?—నిజంగా !'' అయనగొంతు ఆనందంతో గాద్గద్యం వహించింది.

"ఆc ! బ్రతుకుతుంది.'' అన్నాడు గిట్టకర్చుకున్న పళ్ళను చెంచాతో వెడల్పుచేసి, మందు నాలికమీదవేస్తున్న ఆచార్లువారు. ఆయన దేముళ్ళా కన్పించాడు ఆ ఇంటి యజమానికి.

"తల్లీ!" అనబోయాడు. సువర్ణ అక్కడ లేదు.

మరణంతో యుద్ధం చేస్తున్నట్లుగా వున్న రోగివంక చూస్తూ కూచున్న అయనతో 'కొద్ది సేపట్లో తెలివి వస్తుంది. బార్లీ ఇయ్యండి త్రాగడానికి' అని ఆచార్లుగారు లేచి నిలబడ్డారు.

'మీ ఋణం నేను ఎల్లా తీర్చుకుంటాను.'

ఆచార్లుగారు నవ్వారు. 'మీరు కంగారు పడకండి. ఆమెను కంగారు పెట్టకండి' ఆచార్లుగార్ని వీధిదాకా పంపించి, వెనక్కు తిరిగివచ్చి భార్య వైపు చూస్తూ కూచుండి పోయాడు ఆయన. ఈ జీవితో తను నలభై ఏళ్ళపాటు సంసారం గడిపాడు. ఆవిడ ఎన్ని రకాల అనుభవాలను తనకు అందించింది. మొదట మొదట ముగ్ధగా ఉండేది. తను బజారు నుంచి పువ్వులు కొనుక్కువస్తే ఎంతో ఆనందపడిపోయేది. ఆనందాన్ని దాచుకోలేని ఆమె ఎంత మంచి వారండీ! అంటూ తన కౌగిట ఒదిగి పోయేది. ఆ తర్వాత "ఎందుకూ?" అంటూ బెట్టుచేసి తననుసమీపించేది. ఆ తర్వాత పూవులు తీసుకొనిరాని రోజున 'ఎందుకు తీసుకురాలేదు?" అంటూ తనను దండించి అడిగింది. మొదట తనే ఆమెకు ప్రాణం. తర్వాత తను సంపాదించే డబ్బుతోనూ, ఆమెకు సంబంధ మేర్పడింది. రాను రాను, డబ్బే తనకన్న ఆమెకు ఎక్కువేమో అన్న అనుమానమూ తనకు వేసింది.

ఏమిటో! డబ్బులేనిది ఎల్లా బ్రతకడం? పురుళ్ళకూ పుణ్యాలకూ గౌరవానికీ, విందులకూ డబ్బేకదా కారణం! మనిషి పుడితే డబ్బు, మనిషి మరణిస్తే డబ్బు! నిజానికి ఆడబ్బు లేకనే కదా, తను సువర్ణ పెళ్ళిని ఇంతవరకూ అపుచేసింది.

ఆయన కూర్చుని భార్య వంకనే చూస్తున్నాడు. వెడల్పాటికళ్ళు. ఆ కళ్ళమీద జీవితంలోని అనుభవాన్నింతటినీ పొదుపుకుని విశాలమైన ట్లున్న నుదురు. నుదుటి మధ్యగా కాపీ అంత కుంకుమబొట్టు, సర్వ

ధర్మాన్నీ, సర్వ జగత్తునూ నిర్లక్ష్యం చేస్తున్నట్లున్న నాసిక, అన్నీ తెలిసి ఏమీ చేయలేని నిస్సహాయతను తెలిపే బరువైన పెదిమలు-ఇలా వుండాలి గామోసు స్త్రీ!

ఆయన వంగి ఆమెను పరిశీలిస్తున్నారు ఆమె కళ్ళు కొద్దికొద్దిగా కదులుతున్నాయి. ఆ పెదిమలేవో పలుకుతున్నాయి. "సువర్ణా?" అంటోంది ఆ తల్లి హృదయం.

"నేనే! వచ్చాను. డబ్బుతీసుకుని! నువ్వు చెప్పినట్టే చేశాను ఇల్లు తాకట్టు పెట్టేశాను. పోనిద్దూ-ఇల్లు మనని సంపాయించిందా, మనం ఇంటిని సంపాయించామా?- మనదైతే అది మనకే ఉంటుంది.

ఇహ నాకు ఆ విచారమూ లేదు. నువ్వు మిగిలావు. అదే పది వేలు. దానికి పెళ్ళిచేస్తాను. అది సుఖంగా కాపురం చేసుకుంటూవుంటే, రామా కృష్ణా అంటూ...."

ఆమె మెల్లిగా కళ్ళు తెరచింది మాసికలుపడ్డ లాల్చీతో పెరిగిన గడ్డంతో, లోపలకు పోయిన కళ్ళతో ఆశగా చూస్తున్న ఆయన, బల వంతాన పెదిమల మీదకు నవ్వు తెచ్చుకుంది. 'ఎందుకూ అంత భయం?- నేను పోతాననే'' ఆమె నోటిని ఆయన మూసివేశారు.

"అల్లా అనకు. భయమంటే భయమే! నీ మాటమీద డబ్బు తెచ్చాను - ఇల్లు తాకటుపెట్టి, పిల్ల పెళ్ళికోసమని" ఆమె అటు యిటూ చూసింది. అనుమానంగా అడిగింది. "అమ్మాయేదీ! ఇంట్లోనే వుండాలి. అమ్మాయ్!- అమ్మ పిలుస్తోందమ్మా, ఇట్రా ఒక్కసారి."

లోపలనుంచి సమాధానంలేదు. వంట ఇంట్లో మంట ఆరి పోయింది.

ఆమె లేచి నిలబడబోయింది. "వద్దు, వద్దు. నేను వెళ్ళి పిల్చుకు వస్తాను'' ఆమె బలహీనంగా ముందుకు అడుగువేసింది.

"ఇదిగో డబ్బు, జాగర్తచెయ్"

భర్త చేతిలోనుండి డబ్బు తీసుకుంటూ ఆ సునవైపు చూసింది. ఆయన కళ్ళు తృప్తితో గర్వంతో మెరుస్తున్నాయి. "మంచి సంబంధం చూస్తాను. కొస్త కలిగిన ఇంట్లో పడేస్తాను."

ఆమె అంగీకారంగా తల వూపింది "ఆ చూసేదేదో కాస్త తొందరగా చూడండి."

ఆమె లోపలకు వెళ్ళింది. ఆయన అక్కడే నలబడి వూహల మేడలు కడుతున్నాడు. "అందరినీ తను పెళ్ళికి పిలుస్తాడు. ఇహ తను చేయబోయి ఏదైనా శుభకార్యం చేస్తాడు గనుక?" ఆయన హృదయపు అట్టడుగు పొరలో ఒక వూహ మెదిలింది. "తాను తాకట్టు విడిపించ గలడా!– ఇహ ఈ జన్మకు అది సాధ్యం కాదు" కలుక్కుమంది మనసు.

గది తలుపులు కదిలినట్టయ్యాయి. వెళ్ళిన మనిషి వెళ్ళినట్లే తూలుకుంటూ తిరిగి వచ్చింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు ఇంకి పోతున్నాయి. డబ్బుమూట విసిరి ఆయనమీద పడేసింది. "ఏమైంది! ఏమైంది?" అంటున్నాడాయన. ఆమె కళ్లు మూసుకుని, రక్తం పిండి మాటలుగా పలుకుతున్నది. "అక్కర్లేదు. ఈ డబ్బిహ అక్కర్లేదు. మనం పెళ్ళి చేయనక్కరలేదు. కట్నాలియ్య నక్కర్లేదు. ఇల్లు తాకట్టు పెట్టనక్కర లేదు. ఏదీ అక్కరలేదు. మన అమ్మాయి మనకిక అక్కరలేదు. మన డబ్బే మనకు మిగిలింది." ఏమైంది? ఎమైంది?" అంటూ తడబడు తున్న అడుగులతో ఆయన గదివైపుగా నడవబోయాడు. వెనకనుంచి ఆమె మాటలు మంటగా తగులుతున్నాయి. "నేను మిగిలాను. అది పోయింది." మంచువంటి మాటలో మంటదాగివుంది. మాట మంచుకన్న క్రూరంగా హృదయాన్ని కోసేస్తోంది.